క్లుప్తంగా

'చర్య తీసుకోవాలి'

భూపాలపల్లి రూరల్: దివ్యాంగులను కించపరిచిన ఐఏఎస్ స్మితా సబర్వాల్‌పై దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం కఠిన చర్య తీసుకోవాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ ఇండియా) జిల్లా అధ్యక్షుడు నీలంబరం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్మితా సబర్వాల్ ఉన్నతమైన పదవిలో ఉండి దివ్యాంగులపై అనుచిత వాఖ్యలు చేయడం సరికాదన్నారు. స్మితా సబర్వాల్ మాటలతో దివ్యాంగుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వంగ నర్సయ్య, గుమాస భూమయ్య, వెంగళ రమేశ్, వావిలాల గణేష్, తిక్క స్వామి, దాసారపు రఘుపతి, అడప ప్రసాద్, సున్నాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



చిట్యాల: మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన వర్ధమాన గేయ రచయిత పోతుగంటి శ్రావణ్‌కుమార్ తండ్రి వీరేశం(55) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మిట్టపల్లి మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు పుల్ల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పరామర్శించారు. అనంతరం మృతుడి చిత్రపటానికి నివాళులర్పించి, రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి మిత్ర మండలి సభ్యులు మాసు రమేష్, పుల్ల శైలేందర్, కల్యాణ్, గురుకుంట్ల కిరణ్, రాయిని శ్రీకాంత్, ఉప్పుల కిరణ్, శశి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత




కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామం ఇప్పల బోరుకు చెందిన దివ్యాంగుడు గౌరయ్యకు చెందిన ఇంటి గోడ భారీ వర్షాలకు కూలిపోయింది. కాగా ఆయన భార్య అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. విషయం తెలుసుకున్న ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి వారి ఇంటికి వచ్చి సోమవారం బాధితులను పరామర్శించి కూలిన గోడ మళ్లీ నిర్మించడానికి రూ. 5 వేల ఆర్థిక సాయం చేశాడు. అన్ని విధాలుగా అండగా ఉంటానని భరోసా కల్పించారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

కాటారం: చెరువులో ప్రమాదవశాత్తు పడిన వృద్ధురాలు మూడు రోజుల తర్వాత శవమై తేలిన సంఘటన కాటారం మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగారం గ్రామానికి చెందిన సంతోషం మల్లమ్మ(75) అనే వృద్ధురాలు కొంత కాలంగా పెద్ద కూతురు కుమారుడి వద్ద ఉంటుంది. ఈ నెల 19న మల్లమ్మ కాటారంలోని చిన్న కూతురు బొమ్మ భవాని ఇంటికి వెళ్లి ఆస్పత్రిలో చూయించుకుంటానని ఇంటి నుంచి బయల్దేరి వచ్చింది. మూడు రోజులు గడిచినప్పటికీ మల్లమ్మ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు భవానిని అడిగి తెలుసుకోగా తన వద్దకు రాలేదని చెప్పడంతో తెలిసిన వారి ఇళ్లలో, బంధువుల ఇళ్లలో ఆరా తీసినప్పటికీ ఆచూకి లభించలేదు. కాగా సోమవారం ఉదమం ఓ వృద్ధురాలి మృతదేహం కాటారం పాత చెరువు నీటిలో కొట్టుకు రావడంతో గమనించిన మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మల్లమ్మ చిన్న కూతురు భవాని తన తల్లి మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. మల్లమ్మ పాత చెరువులోకి వెళ్లే కాలువలో ప్రమాదవశాత్తు పడిపోయినట్లు ఆమె మనుమడు బాల్నె లక్ష్మణ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా చెరువులోకి కొట్టుకుపోయి మృతి చెందినట్లు తెలిపారు. లక్ష్మన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

కుక్కల దాడిలో మేకలు..



మల్హర్: కుక్కల దాడిలో మూడు మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని కొయ్యూరులో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మొగిళి మల్లేష్, ఆడెపు సంపత్, లకావత్ సవేందర్‌లకు చెందిన తలో ఒక మేక గ్రామ శివారులో మేత మేస్తుండగా కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో మూడు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ రూ.40వేల ఉంటుందని బాధితులు తెలిపారు. మరో రెండు మేకలు కనబడటం లేదని వారు వాపోయారు.

పుట్టగొడుగుల పెంపకంతో ఆదాయం



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శామ్యుల్



వంట గదిని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి శామ్యుల్

రేగొండ: అధిక దిగుబడినిచ్చే పుట్టగొడుగుల పెంపకం ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని మండల ప్రత్యేక అధికారి శామ్యుల్ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ భూపాలపల్లి, ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ హసన్‌పర్తి వారి ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై పది రోజులు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. అందుబాటులో ఉన్న వనరులతో తక్కువ పెట్టుబడితోనే పుట్టగొడుగుల సాగును చేపట్టవచ్చన్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏపీఓ జమీర్ పాషా, ప్రోగ్రాం ట్రైనర్ బాలస్వామి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కిషోర్, ఆర్‌సెటీ శిక్షణ సంస్థ డైరెక్టర్ రవి, డిఆర్‌పి టెక్నికల్ అసిస్టెంట్ కిషన్ పాల్గొన్నారు.

పాఠశాలను ఆకస్మిక తనిఖీ

మండలంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, మహాత్మజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలను సోమవారం మండల ప్రత్యేక అధికారి శామ్యుల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో భోజనం, తాగునీరు, వంటగది, క్లాస్ టరూమ్స్, టాయిలెట్స్‌ను పరిశీలించారు.

మరమ్మతులు చేపట్టాలి

నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు జమ్‌షేడ్‌బేగ్‌పేట బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు కోతకు గురైంది. దీంతో రేగొండ నుంచి కొత్తపల్లిగోరికి రాకపోకలు నిలిచిపోయాయి. కాగా కోతకు గురైన రోడ్డును మండల ప్రత్యేక అధికారి శామ్యుల్ పరిశీలించారు. కోతకు గురైన రోడ్డుకు మరమ్మతులు వెంటనే చేపట్టాలని గుత్తేదారును ఆదేశించారు. ఎంపీఓ రాంప్రసాద రావు, పంచాయతీ కార్యదర్శులు స్రవంతి ఉన్నారు.

చివరి వరకు నీరందేలా చూడాలి



చలివాగు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- ఆయకట్టుకు చలివాగు నీటి విడుదల

శాయంపేట: సాగునీటిని అధికారులు వృథా చేయకుండా చివరి వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. సోమవారం జోగంపల్లి శివారులోని మధ్యతరహా చలివాగు ప్రాజెక్టునుంచి సోమవారం ఎమ్మెల్యే నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలివాగు ప్రాజెక్టు మరమ్మతుల కోసం యాసంగి సీజన్‌లో రైతులు క్రాప్ హాలిడే ప్రకటించినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల మొదటి దశలో కొద్ది మేరకే సిమెంట్ లైనింగ్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మొదటి పంట పూర్తయ్యాక అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు మిగులు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం విడుదల చేసిన సాగునీటితో నాట్లు వేసుకొని పంటలు పండించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తే అతన్ని మార్చి డబ్బులు దుర్వినియోగం కాకుండా సిమెంట్ లైనింగ్ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐబీ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ గిరిధర్, ఏఈ అమృత్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు చిందం రవి, అబ్బు ప్రకాష్ రెడ్డి, కృష్ణమూర్తి, రఘుపతి రెడ్డి, రవీందర్, ఈశ్వర్, కుమారస్వామి, ప్రభాకర్, కట్టయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



అలుగుపోస్తున్న చలివాగు

18ఫీట్ల నీటిమట్టం చేరిన చలివాగు

చలివాగు ప్రాజెక్టుకు ఎగువనుంచి వచ్చిన వరదతో నిండుకుండలా మారింది. సోమవారం 18ఫీట్ల నీటి మట్టానికి చేరుకొని అలుగు పోస్తోంది. ప్రాజెక్టులోకి భారీగా నీరు చేరడంతో ఖరీఫ్, రబీ సీజన్‌కు సాగునీటి సమస్య తలెత్తదని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చలివాగులో సమృద్ధిగా నీరు ఉంటే శాయంపేట, పరకాల, రేగొండ, చిట్యాల మండలాలకు సాగునీటితోపాటు, శాయంపేట, పరకాల మండలాలకు మిషన్ భగీరథ పథకంలో తాగునీరు అందిస్తుంది.

గెరువిచ్చిన వాన



పలిమెల: లోలెవల్ వంతెన వద్ద వరదను పరిశీలిస్తున్న అధికారులు


మహాముత్తారం: నాలుగు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురిసన వాన సోమవారం గెరివిచ్చింది. దీంతో మండలంలో రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగలేదు. ఉదయం కనుకునూర్, రెడ్డిపల్లి, పెగడపల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లారు. లోలెవల్‌కాజ్‌వే వరద లేకపోవడంతో రాకపోకలు యధావిధిగా కొనసాగాయి. ఉదయం కాటారం సీఐ నాగార్జున రావు, మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్ కల్వర్టును పరిశీలించారు.



మహాముత్తారం: లోలెవల్ కాజ్‌వేను పరిశీలిస్తున్న సీఐ నాగార్జునరావు

పలిమెల: వర్షాల కారణంగా మండలంలోని వరద ఉధృతి ప్రాంతాలను ఎంపీడీఓ శ్రీనివాస్, ఎస్సై తమాషారెడ్డి సోమవారం పరిశీ లించారు. గోదావరి ఉప్పొంగి మండలంలోని ముకునూరు తోగు (వాగు) వద్ద లోలెవల్ వంతెనకు వరద నీరు చేరడంతో వాహనదారుల రాకపోకలను నిలిపివేశారు. అలాగే మండలంలోని వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో కన్నాయిగూడెం-పలిమెల మండలాల మధ్య రాకపోకలను నిలిపివేశారు. భూపాలపల్లి-ఏటూరునాగారం వయా మహదేవ్‌పూర్, పలిమెల, భూపాలపల్లి-లక్ష్మీపురం వయా మహదేవ్‌పూర్, పలిమెల మార్గాలను నిలిపివేయడంతో ఏటూరునాగారం సర్వీసులు ముకునూర్ వరకు నడుస్తాయన్నారు. మెంచంపల్లి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో స్థానిక మత్స్యకారులను గోదావరిలో వెళ్లవద్దని కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎంపీఓ ప్రకాశ్‌రెడ్డి, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

మత్తడి సైడ్‌వాల్‌కు పెద్ద బుంగ



కూలిపోతున్న సైడ్‌వాల్

మహాముత్తారం: మండలంలోని నల్లగుంట మీనాజీపేట గ్రామంలోని కొత్తచెరువు మత్తడి సైడ్‌వాల్ కూలిపోతూ నెర్రబాసి ప్రమాదకరంగా ఉంది. గత సంవత్సరం కొద్దిగా ఉన్న బుంగ ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి చెరువు మత్తడి పడటంతో భారీగా ఏర్పడింది. ఇలాగే కొనసాగితే సైడ్‌వాల్ కూలిపోయి కట్టకోతకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. గతంలో నీటిపారుదల శాఖ అధికారులు సమాచారం ఇచ్చినప్పటికీ స్పందించలేదని రైతులు ఆరోపించారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



చలివాగును పరిశీలిస్తున్న సీఐ మల్లేష్

టేకుమట్ల: వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ మల్లేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని చలివాగు వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుపాన్ కారణంగా గ్రామాలలోని చెరువుల్లోకి నీరు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు అటుగా ఎవరూ పోవద్దని తెలిపారు. అలాగే రాఘవారెడ్డి చలివాగు ఉధృతి పెరుగుతుందని కావున మత్స్యకారులు చేపలకు వెళ్లొద్దని అన్నారు. మండలంలోని ముంపు ప్రాంతలైన గ్రామాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. చలివాగు వంతెనపై ఉన్న గడ్డర్లపై నుంచి ఎవరు దాటొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై గోగికారి ప్రసాద్, పోలీస్ సిబ్బంది రమేష్, మహేందర్, రాజయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న వైద్యురాలు నాగమణి

మొగుళ్లపల్లి: పరిసరాల పరిశుభ్రత పాటించడంతో ఆరోగ్యంగా ఉంటామని మండల వైద్యాధికారిణి డాక్టర్ నాగరాణి విద్యార్థులకు సూచించారు. సోమవారం మొగుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కొరికిశాల గ్రామంలోని మోడల్ స్కూల్లో, కస్తూరిబా పాఠశాలలో మండల వైద్యాధికారిని డాక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో సీజన్ వ్యాధులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా వైద్యాధికారిణి డాక్టర్ నాగరాణి మాట్లాడుతూ.. వర్షాలు అధికంగా ఉండడం వల్ల జ్వరాలు, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందని, అదే విధంగా డయేరియా, జలుబు, దగ్గు మొదలైనవి వచ్చే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వేడివేడి ఆహార పదార్థాలు తినాలని, కాచి చల్లార్చిన నీరు తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధీర్ రెడ్డి, కస్తూరిబా ప్రిన్సిపాల్ శైలజ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఆర్ వెంకటస్వామి,, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, శ్రీలత,ఆశా కార్యకర్తలు, పిల్లలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చోరీ



పాఠశాలలో దుండగులు పగులగొట్టిన బీరువా

కాటారం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆఫీస్ రూం తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి రెండు బీరువాలను తెరిచి కాగితాలను చిందరవందర చేశారు. విద్యార్థులకు సంబంధించిన రికార్డులు, ఆఫీస్ ఫైల్స్ ఉన్న బీరువాను దుండగులు ఓపెన్ చేయడానికి ప్రయత్నించారు. కొన్ని ఫైల్స్‌ను ఎత్తుకొని పోయినట్లు తెలిసింది. సోమవారం ఉదయం పాఠశాల తెరవడానికి వచ్చిన ఉపాధ్యాయులు గుర్తించి ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడికి సమాచారం అందించారు. చోరీకి పాల్పడినట్లు గుర్తించిన ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

చిట్యాల: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి కామారెడ్డి ఎన్నికల సభలో బీసీ డిక్లరేషన్ ద్వారా రాష్ట్రంలోని బీసీలకు కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారని అన్నారు. అలాగే గొల్ల కురుమలకు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రెండవ దశ గొర్రెల పంపిణీకి సంబంధించిన రూ.రెండు లక్షలను అకౌంట్లోకి వేస్తామని హామీ ఇచ్చి వారిని మోసం చేశారన్నారు. ముదిరాజ్, గంగపుత్ర, గౌడ్, మూన్నూరుకాపు, పద్మశాలి, విశ్వకర్మ, రజక, సామాజిక వర్గాలకు ఇచ్చిన హామీలన్ని నేరవేర్చేందుకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం ఎంటని ప్రశ్నించారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఖాజామోహియొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు కరుణ్, శ్యాం, మొగిలి, కుమార్, శంకర్, మహేష్, వల్లాల ప్రవీణ్, రాయిని శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దాశరథి జయంతి

కాటారం: దాశరథి కృష్ణమాచార్యుల జయంతి వేడుకలను సోమవారం మండలంలోని ధన్వాడ ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన రచనలు, కవితలను గూర్చి విద్యార్థులకు వివరించారు. దాశరథి వంటి మహాకవి తెలంగాణ చరిత్రలో నిలిచారని ఆయన స్ఫూర్తితో విద్యార్థులు సాహిత్యం, ఉన్నత భావాలను అలవర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గడ్డం లక్ష్మయ్య, రాజబాబు, వెంకటేశ్వర్లు, శరత్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహాధర్నాకు సమాయత్తం కావాలి

భూపాలపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా ఆగస్టు 9న హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ నిర్వహించే మహాధర్నాకు మాదిగలు, మాదిగ ఉపకులాల నాయకులు సమాయత్తం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేణుకుంట్ల కొమురయ్య మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి కొమురయ్య హాజరై మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఎస్సీలను ఏబీసీడీలుగా విభజిస్తామని హామీచ్చారన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజల ఓట్ల మీద ఉన్న ప్రేమ వర్గీకరణపై చూపలేదని ఇకపై బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఇన్‌చార్జ్ ఇంజపెల్లి ప్రవీణ్ మాదిగ మాట్లాడుతూ.. వర్గీకరణ చేయకపోవడం వాళ్ల మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలకు విద్య, ఉద్యోగ, రాజకీయ సంక్షేమ రంగాల్లో పూర్తిగా అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చిలువేరు పవన్ మాదిగ, వంగపండ్ల రాజన్న యాదవ్, హరీష్, పవన్, చిరంజీవి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి

భూపాలపల్లి రూరల్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో ప్రత్యేక రాష్ట్రం కోసం అహర్నిశలు కష్టపడిన జిల్లా నిరుద్యోగ ఉద్యమ కళాకారులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని జిల్లా కళాకారుల ఉమ్మడి జిల్లాల నిరుద్యోగ కళాకారుల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి గడ్డం రమేష్ చంద్ర అన్నారు. ఈ మేరకు కళాకారులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎమ్మెల్యే సత్యనారాయణరావులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. తెలంగాణ కోసం పాటలు పాడినటువంటి ఆటలాడినటువంటి ఉద్యమకారులకు గత ప్రభుత్వం సాంస్కృతిక సారథిలో 550 మందికి ఉద్యోగాలు ఇచ్చి మిగతా కళాకారులకు మొండి చేయి చూపిందని అన్నారు. ఎమ్మెల్యే సత్యనారాయణరావు అసెంబ్లీలో కళాకారుల గురించి ప్రస్తావించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందించి కవులు కళాకారుల ఉద్యోగాల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిరుద్యోగ కళాకారులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. నిరుద్యోగ కళాకారుల జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్ర కుమార్, సహాయ కార్యదర్శి సెగ్గం శ్రావణ్, పుల్ల ప్రతాప్, దొగ్గెల దేవేందర్, దేవునూరి వేణు, దూడపాక దీవాకర్ జాడి రాజ్ సడవలి, కల్లేపల్లి సతీష్, జెట్టి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పీఆర్సీ ప్రకటించాలి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయులు

చిట్యాల: ప్రభుత్వ ఉపాధ్యాయులకు 50 శాతం ఫిట్‌మెంట్‌తో పాటు పీఆర్సీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని జడలపేట, గోపాలపూర్, చిట్యాల, నైన్‌పాక, జూకల్‌తో పాటు పలు పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ టీఎస్ బాధ్యులు రాంనారాయణ, సత్యనారాయణ, కుచనపల్లి శ్రీనివాస్, సాంబమూర్తి, లింగమూర్తి, శ్రీనివాస్, జి. కృష్ణ, రహీమ్‌పాషా, వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కాటారం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన కాటారం మండలం కిష్టంపేట సమీపంలో కాటారం-మంథని ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దేవరాంపల్లికి చెందిన మారుపాక అంజి బైక్‌పై దేవరాంపల్లి వైపుగా వెళ్తున్నాడు. కిష్టంపేటకు చెందిన పట్టెం మల్లేశ్ గ్రామం నుంచి ధన్వాడకు నడుచుకుంటూ వెళ్తుండగా అంజి బైక్‌తో బలంగా ఢీకొట్టాడు. దీంతో మల్లేశ్, అంజి రోడ్డుపై ఎగిరిపడటంతో తీవ్రగాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అంజి తల, ముక్కుకు తీవ్రగాయాలై పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌కు ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు.

సెల్ టవర్‌కు సిగ్నల్స్ అమర్చాలి

ఏటూరునాగారం: మారుమూల ఏజెన్సీ గ్రామం, వరద ముంపు ప్రాంతమైన కొండాయి గ్రామంలో ఏర్పాటు చేసిన సెల్‌టవర్‌కు సిగ్నల్స్ బూస్టర్లను అమర్చాలని అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ చైర్మన్ పరికి ప్రసాద్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ ఐదునెలల క్రితం ఈ గ్రామంలో సెల్‌టవర్‌ను బీఎస్‌ఎన్‌ఎల్ వారు ఏర్పాటు చేసి ఎలాంటి బూస్టర్లను అమర్చలేదన్నారు. ఒక వైపు వర్షాలు, మరో వైపు వరదలతో కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీ ప్ర జలు బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. గత ఏడాది వచ్చిన వరదలకు 8 మంది వరదల్లో చిక్కుకు పోగా అప్పుడు కూడా ఎలాంటి సిగ్నల్స్ లేకపోవడం వల్లనే వారి ప్రాణాలు గాలిలో కలిసిపోయాయన్నారు. వరదబాధితులకు సహాయం అందించడంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ ప్రభుత్వం స్పందించి రక్షణ కల్పించాలని కోరారు. భిక్షపతి, నర్సింగరావు, సాంబయ్య, రవీందర్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గంటల నుండి రాత్రి 8.00 గంటల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410